క్లుప్తంగా

క్రీడలతో దేహ దారుఢ్యం



విద్యార్థులకు చెస్ బోర్డులు పంపిణీ చేస్తున్న డాక్టర్ అద్దాల సత్యనారాయణ

బోట్‌క్లబ్: విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంచాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షులు వెదురుపాక సతీష్ అన్నారు. స్థానిక వార్ఫు రోడ్డులోని భవిత దివ్యాంగుల పాఠశాలలో గురువారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ చెస్ దినోత్సవం, భారత్ దివ్యాంగుల ఒలింపియాడ్ దినోత్సవాలు నిర్వహించారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అద్దాల సత్యనారాయణ మాట్లాడుతూ ఈ భవిత పాఠశాల్లో పిల్లలకు క్రీడల పట్ల ఆసక్తి పెరిగితే శారీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. అనంతరం విద్యార్థులు చెస్ బోర్డులు, క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. అసోసియేషన్ సభ్యులు నారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సురక్షిత సమాజం కోసమే వారధి

- డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ మురళీకృష్ణ



వారధి కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి

కాకినాడ రూరల్: ప్రజలల్లో చైతన్యంతో పాటు సురక్షిత సమాజం కోసం ఎస్పీ సతీష్ ఆదేశాల మేరకు వారధి నిర్వహిస్తున్నామని డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ మురళీకృష్ణ తెలిపారు. రమణయ్యపేట పరిధిలోని రాయుడువారి పాలెంలో విశ్రాంత పోలీసు ఉద్యోగుల భవనంలో లింగం రవి అధ్యక్షతన బుధవారం రాత్రి సర్పవరం పోలీసులు వారధి నిర్వహించారు. రాయుడువారిపాలెం, శేషాద్రినగర్‌కు చెందిన వారికి పోలీసు సేవల గురించి డీఎస్పీ వివరించారు. గంజాయి, తదితర మత్తు పదార్థాలు లేని సమాజ స్థాపన దిశగా అడుగులు వేసేందుకు సహకరించాలని కోరారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విశ్రాంత పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ దొంగ వెంకట సత్యనారాయణ, పెద్ద సత్యం, డీకే వరప్రసా తదితరులు పాల్గొన్నారు.

ఆండాళ్ అమ్మవారి స్నపన తిరుమంజనం

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో ఆండాళ్ తిరునక్షత్రం సందర్భంగా ఈ నెల 22న అమ్మవారికి స్నపన తిరుమంజనం జరుగుతుందని ఈఓ బీవీఆర్ చౌదరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి నూతన వస్త్రాంకరణ, అలంకారం, పూజ జరుగుతుందన్నారు. గోదా అమ్మవారికి భక్తులు చేయించిన వెండి మకరతోరణం సంప్రోక్షణ అనంతరం అమ్మవారికి అలంకరించనున్నట్టు తెలిపారు.

పేదలకు కళ్లజోళ్లు, వస్త్రాల పంపిణీ



కళ్లజోళ్లు, వస్త్రాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

బాలాజీచెరువు: లయన్స్‌క్లబ్ హాల్లో గురువారం రెడ్ కాన్వెంట్ పూర్వవిద్యార్థుల ట్రస్ట్ ద్వారా 60 మంది పేదలకు దుస్తులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థి మండవిల్లి జనార్దన్ హాజరై ట్రస్ట్ ద్వారా ఇప్పటి వరకూ దాదాపు 3 వేల మందికి సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ బాదం బాలకృష్ణ, ట్రస్ట్ అధ్యక్షులు సీమకుర్తి పాపారావు,రెడ్నం రమణామూర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి స్వల్ప గాయాలు

పిఠాపురం: గొల్లప్రోలు 216వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో ఐదుగురికి స్వల్ప గాయాలైనట్టు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. శంఖవరం నుంచి కాకినాడ వెళతున్న ఆటోను పిఠాపురం నుంచి గొల్లప్రోలు వైపు వస్తున్న మరో ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శంఖవరానికి చెందిన ఐదుగురికి గాయాలవ్వగా వారిని మొబైల్ పోలీసులు 108లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హిందీపై రైల్వే ఉద్యోగులు పట్టు సాధించాలి

సామర్లకోట: రైల్వే ఉద్యోగులు హిందీపై పట్టు సాధించాలని విజయవాడ రైల్వే డివిజన్ రాజ్య భాష అధికారి ఎ.మహేష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక స్టేషన్ మేనేజరు కార్యాలయంలో రైల్వే ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రైల్వే ఉద్యోగులు ఉత్తర, ప్రత్యుత్తరాలన్నింటిలో హిందీ భాష తప్పని సరిగా వాడాలన్నారు. స్టేషన్ మేనేజరు ఎం.రమేష్, రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు జోగారావు తదితరులు పాల్గొన్నారు.

రిథమ్ ఆఫ్ లైఫ్



మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ రకాల హెడ్‌ఫోన్స్

- మార్కెట్‌కు హెడ్‌ఫోన్ ట్రెండ్
- అధికంగా కొనుగోలు చేస్తున్న యువత
- ఫోన్‌తో పాటు హెడ్‌ఫోన్ కొనుగోలు



హెడ్‌ఫోన్‌తో ఆన్‌లైన్ కార్యకలాపాలు సాగిస్తున్న ఉద్యోగి

బోట్‌క్లబ్: మ్యూజిక్.. సంగీతం.. దేశీయమైనా, పాశ్చాత్యమైనా మరేదైనా ఆస్వాదించని జీవి సృష్టిలో లేదు. మనిషైనా, పశువైనా, మొక్కైనా, మానైనా మ్యూజిక్‌కు తగ్గట్టు స్పందించి తీరాల్సిందే. అంతటి శక్తి ప్రపంచ భాషైన సంగీతానికే సొంతం. అంతటి మ్యూజిక్‌ను సందర్భానికి, వ్యక్తిత్వానికి అభిరుచికి తగ్గట్టుగా వింటుంటారు సంగీత ప్రియులు. ప్రత్యక్ష ప్రసారం, రేడియో, గ్రామ్‌ఫోన్, టేప్ రికార్డర్, హోమ్ థియేటర్, సౌండ్ బార్ ఇలా ఎన్నో రూపాంతరం చెందుతూ వచ్చినా ఇవన్నీ అందరూ సామూహికంగా వినే సాధనాలు. కానీ అభిరుచి మేరకు కావలసిన మ్యూజిక్ వినాలంటే ఇయర్ ఫోన్స్, హెడ్‌ఫోన్స్, బడ్స్, మరెన్నో ఆధునిక పరికరాలు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. ప్రతి ఒక్కరి జీవితంలో ఇవి కర్ణుడి కవచ కుండలాల్లా తయారయ్యాయంటే అతిశయోక్తి కాదు. ఇంటా, బయటా, ప్రయాణంలో, విధి నిర్వహణలో ఎన్నో విధాలుగా ఉపయోగపడుతున్నాయి.

అభిరుచికి తగ్గట్టుగా..

వినియోగించే వారి చెవి ఎముకల అమరిక బట్టి కొన్నికొన్ని మాత్రమే కొందరికి సరిగ్గా అమరుతాయి. అందరికీ అన్నీ నప్పవు. చెవి లోపలికి పెట్టుకునే ఇన్ ఇయర్ ఫోన్స్, బడ్స్ ఒక రకమైతే, చెవి బయట పెట్టుకునే హెడ్ ఫోన్స్ మరో రకం. ఈ రకాలు కాకుండా బోన్ కన్డక్షన్ నెక్‌ఫోన్స్ మరింత ఆధునికమైనవి. శబ్ద తీవ్రత నేరుగా కర్ణభేరికి తగలకుండా చెవి కింద ఎముక ద్వారా సంగీతాన్ని మెదడుకు చేర్చే పరికరం ఇది. వీటిలో కొన్నింటికి యాక్టివ్ నాయిస్ కాన్సిలేషన్ (బయటి శబ్దాలు వినిపించకుండా ఏదైతే పరికరం ద్వారా వస్తోందో అదే వినిపించే సాంకేతికత) తదితర అదనపు సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి.

నాణ్యతను బట్టి ధర

రూ.వెయ్యి నుంచి రూ.లక్షల పైబడే హెడ్‌ఫోన్లు మార్కెట్‌లో లభ్యమవుతుంటాయి. స్పష్టత, శ్రావ్యత, ట్రిపుల్, బేస్‌లో నాణ్యతను బట్టి, అభిరుచిని బట్టి ధర కూడా ఉంటుంది.

కొనుగోలు చేసేది యువతే

నగరంలో సుమారు 80కి పైగా చిన్న, పెద్ద సెల్‌ఫోన్ విక్రయ దుకాణాలు ఉన్నాయి. సెల్‌ఫోన్‌లు విక్రయించే ప్రతీ దుకాణంలో హెడ్‌ఫోన్‌లు విక్రయిస్తున్నారు. నిత్యం వందల్లో హెడ్‌ఫోన్ల విక్రయాలు సాగుతున్నాయంటే వీటి వినియోగం ఏ మేరకు ఉందో అర్థమవుతుంది. వీటితో పాటు ఆన్‌లైన్‌లో విక్రయాలు ఎక్కువేనని డెలివరీ బాయ్‌లు చెప్పే మాట.

అతి వినియోగం అనర్థమే..

ఎక్కువసేపు పెద్ద శబ్దంతో వింటే వినికిడి సమస్య వచ్చే అవకాశాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. 60 డెసిబుల్స్ కంటే తక్కువగా ఉంటే వినికిడి సమస్య వచ్చే అవకాశం ఉండదు. 85 డెసిబుల్స్ దాటితే సమస్య తప్పదు. ప్రతి అరగంటకూ స్వల్ప విరామం అవసరమని ఈఎన్‌టీ వైద్యులు చెప్తున్నారు.

యువత అధికంగా కొనుగోలు చేస్తున్నారు



సాధారణ ఇయర్‌ఫోన్స్, ఇయర్ బడ్స్ వినియోగిస్తే బయట శబ్దం కూడా వినిపిస్తుంది. అదే హెడ్‌ఫోన్స్ అయితే బయట శబ్దం వినబడదు. అందుకే యువత అధికంగా బైక్‌పైనా వెళ్లేటప్పుడు వీటిని వినియోగించుకొనేందుకు కొనుగోలు చేస్తున్నారు. నా షాపులో ప్రతి రోజు ఐదు నుంచి ఆరు హెడ్‌ఫోన్స్ విక్రయిస్తాను.

– రాజా రవిశంకర్, సెల్‌షాపు యజమాని

మెడికవర్ వైద్యులకు కలెక్టర్ అభినందన

- ఆరోగ్యశ్రీలో బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్
- రూ.6.5 లక్షల వైద్యం ఉచితంగా నిర్వహణ



మెడికవర్ ఆస్పత్రి సిబ్బందిని అభినందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఉభయ గోదావరి జిల్లాల్లోనే మొట్ట మొదటి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌ని పూర్తిగా ఆరోగ్యశ్రీ పథకంలో చేసి క్యాన్సర్ రోగి ప్రాణాలు కాపాడిన స్థానిక మెడికవర్ ఆస్పత్రి సిబ్బందిని కలెక్టర్ కృతికా శుక్లా అభినందించారు. గురువారం కలెక్టరేట్‌లో మెడికవర్ సిబ్బంది ఆమెను మర్యాద పూర్వకంగా కలవగా వారిని అభినందించారు. డాక్టర్ మురళీధర్ ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఏ ఖర్చు లేకుండా పూర్తిగా ఈ చికిత్సను ఉచితంగా అందించారన్నారు. వెన్ను నొప్పితో బాధపడుతున్న 50 ఏళ్ల పాలిక సత్యనారాయణకు పరీక్షలు చేయగా, మైలోమ అనే రక్త క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించి, సకాలంలో సరైన చికిత్స అందించడం వల్ల రోగి ప్రాణాలను కాపాడగలిగినట్టు తెలిపారు. రూ.6.5 లక్షలు ఖర్చు అయ్యే ఈ చికిత్సను ఉచితంగా చేసినట్టు తెలిపారు. చికిత్స చేసిన మురళీధర్, సిద్ధార్థరెడ్డి, సిబ్బందిని ప్రశంసించారు. ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ పి.రాధాకృష్ణ, మేనేజర్ కె. నవీన్, మెడికవర్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సిరిపురంలో సర్టిఫికెట్ల అందజేత



సిరిపురంలో ధృవపత్రాలు అందజేస్తున్న సర్పంచ్ సుజాత

కరప: మండలం సిరిపురం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరాన్ని సర్పంచ్ నున్న సుజాత ప్రారంభించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి 250 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీడీఓ కె.అప్పారావు, డీటీ కె.అనిల్‌కుమార్, కార్యదర్శి కోలా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకుడు నున్న వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

- పలు దుకాణాలపై కేసుల నమోదు



పప్పుదినుసుల విక్రయ కేంద్రంలో సీజ్ చేసిన సరకుతో అధికారులు

కాకినాడ క్రైం: జిల్లాలో పలు విక్రయ కేంద్రాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సివిల్ సప్లైస్, లీగల్ మెట్రాలజీ అధికారులతో కలసి గురువారం పప్పు ధాన్యాల నిల్వలపై తనిఖీ చేపట్టారు. జిల్లా గొల్లప్రోలు మండలంలో వెంకటనాగలక్ష్మి ట్రేడర్స్‌లో అధికారులు తనిఖీలు చేసి పప్పు దినుసుల ప్యాకెట్లపై మ్యాండెటరీ డిక్లరేషన్ లేకపోవడాన్ని గుర్తించి రెండు కేసులు నమోదు చేశారు. అదే గ్రామంలో సాయిశివకృష్ణ జనరల్ స్టోర్స్‌లో వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాటాకు స్టాంపింగ్ లేకపోవడంపై కేసు నమోదు చేశారు. శ్రీ లక్ష్మీగణపతి ఆయిల్ అండ్ జనరల్‌స్టోర్స్‌లో బిల్లులు సమర్పించక పోవడం, ధరల పట్టిక ప్రదర్శించకపోవడంపై కేసు నమోదు చేశారు. 2.11లక్షల విలువైన పప్పు ధాన్యాలను సీజ్ చేశారు. సదరు వ్యాపారిపై కేసు నమోదు చేశారు. రాజమహేంద్రవరం ఇన్‌చార్జి రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమారి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.

డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన ర్యాలీ



డిజిటల్ రంగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

బాలాజీచెరువు: అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా డిజిటల్ బ్యాంకింగ్ రంగంపై జేఎన్‌టీయూ ఎస్‌బీఐ బ్రాంచ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రాంచ్ చీఫ్ మేనేజర్ అద్దంకి శివప్రసాద్ డిజిటల్ బ్యాంకింగ్ ద్వారా పొందుతున్న సేవలు, పాస్‌వర్డ్ జాగ్రత్తలు, ఎస్‌బీఐ యోనో యాప్ తదితర అంశాలను వివరించారు. నేటి కాలంలో ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ ఆర్థిక కార్యకలాపాలు తమ మొబైల్స్ ద్వారా చేస్తున్న నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కళాశాల విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది, బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ఎంఎల్‌హెచ్‌పీలకు అవగాహన కల్పించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గర్భధారణకు పూర్వ, తదనంతర వైద్యసేవలపై సూచనలు ఇచ్చారు. గర్భస్థ పిండ, లింగ నిర్ధారణ నిషేధం చట్టాన్ని వివరిస్తూ నిషేధాన్ని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం తీసుకునే చర్యలను వివరించారు. జిల్లాలో అర్హులు కాని వ్యక్తులు స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ల అధికారులతో పాటు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

సిరుల వెదజల్లు

- కరప మండలంలో చురుగ్గా వరినాట్లు
- పెరిగిన కూలీ రేట్లతో అన్నదాత ఆందోళన
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే స్వల్ప వ్యవధిలో అధిక దిగుబడి, ఆదాయం



గొర్రిపూడిలో వరినాట్లు వేస్తున్న రైతులు

కరప: మండలంలో వరినాట్లు ప్రారంభమయ్యాయి. ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని అధికారులు ఆదేశిస్తున్నారు. జూన్ ఒకటో తేదీనే కాలువలకు నీరు వదిలారు. నైరుతి రుతు పవనాలు మొండికేయడం, అధిక ఎండలకు జడిసి రైతులు నారుమళ్లు వేయడంలో రెండు వారాలు ఆలస్యం చేశారు. కాలువల మొగలో ఉన్న రైతులు సంప్రదాయపద్ధతిలో వరినాట్లు వేసేందుకు నారుమడులు వేసుకున్నారు. మరికొంత మంది వెదజల్లు సాగుకు మొగ్గు చూపుతున్నారు. మండలంలో 14,400 ఎకరాల్లో వరి సాగుచేస్తారు. ముందుగా వేసిన నారుమళ్లు ఏపుగా పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు. మగవారికి రూ.700 నుంచి రూ.900, మహిళా కూలీలకు రూ.500 నుంచి రూ.550 వంతున కూలి ఇస్తున్నారు. అధిక వర్షాలు పడకూడదని రైతులు దేవుడిని వేడుకుంటున్నారు.

వెదజల్లు సాగుకు మొగ్గు

మండలంలో అధిక శాతం రైతులు వెదజల్లు సాగుకు సమాయత్త మవుతున్నారు. సాధారణంగా సార్వాసీజన్‌లో వెదజల్లు కంటే సాంప్రదాయ పద్ధతిలో నాట్లకే రైతులు మొగ్గు చూపుతారు. వెదజల్లిన వారం రోజుల్లో వర్షాలు పడితే పొలాలు దెబ్బతింటాయని అందుకే సంప్రదాయ పద్ధతిలో నారు పెంచి, ఊడుస్తారు. కానీ వెదజల్లిన పొలాలు రెండు వారాలు ముందే కోతకు వస్తాయి. పెట్టుబడులు ఆదా అవుతాయని కొందరు రైతులు బెంగాలీ ఊడ్పుల పద్ధతి అనుసరిస్తున్నారు. బెంగాలీ కూలీలే వరినారు, తీసి, నాట్లువేసేందుకు ఎకరానికి రూ 4,200 తీసుకుంటున్నారు. అదే సంప్రదాయ పద్ధతిలో అయితే నారుతీసి, నాట్లు వేసేందుకు రూ.10 వేలు ఖర్చవుతుందని రైతులు తెలిపారు.



వరినారు తీస్తున్న కూలీలు

విత్తనశుద్ధి చేయాలి

నారుమళ్లు వేసుకుని వెదజల్లు సాగును అనుసరిస్తే సమయం, పెట్టుబడులు ఆదా అవుతాయి. తప్పనిసరిగా విత్తనశుద్ధిచేయాలి. విత్తనాలు నానపెట్టి మొలకవచ్చిన తర్వాత మళ్లల్లో బురదపదునుపై చల్లాలి. ఒకరోజు తర్వాత మళ్లల్లో నీరుదింపి, రెండు రోజులు ఆరనిచ్చి మళ్లీ నీటితడి పెట్టాలి. తర్వాత వారంరోజుల వ్యవధిలో కలుపు నివారణకు మందులు పిచికారీ చేసి, వ్యవసాయశాఖ సిఫార్సుల మేరకు ఎరువులువాడితే వరిచేలు దుబ్బుచేసి, ఏపుగా పెరుగుతాయి.



– ఏపీ రాజేష్, ఎంఏఓ, కరప మండలం

వలంటీర్లకు వందనం

సొంత మనిషిలా..

ఇతని పేరు ఎం.రూపేష్ కుమార్ కాకినాడ భానుగుడి సమీపంలోని దంతులూరి వీధిలో వలంటీర్. కరోనా సమయంలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేసి ఎందరికో సాయంచేశారు. తనకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి ఎవరికైనా జ్వరం ఉందా, అస్వస్థత గురయ్యారా అని అడుగుతూ ధైర్యం చెప్పేవాడు. అవసరమైన వైద్య పరీక్షలు చేయించడేమ కాక దాతలు అందించిన నిత్యావసర వస్తువులు, భోజనం సరఫరా చేసి ఎంతో ఆదుకున్నారు.



అమ్మఒడి పథకం కోసం ఈకేవైసీ నమోదు చేసుకుంటున్న వలంటీర్ రూపేష్‌కుమార్

సేవలు మర్చిపోలేను

కరోనా సమయంలో మా వలంటీర్ రూపేష్‌కుమార్ అందించిన సేవలు మరువలేను. నేడు ప్రభుత్వ పథకాలు మాకు అందుతున్నాయంటే దానికి కారణంగా ఆయనే. ఎప్పటి నుంచో ఇంటి స్థలం కోసం ఎదురు చూసాము. గత ప్రభుత్వ హయాంలో అనేక సార్లు దరఖాస్తు చేసుకున్నా రాలేదు. కానీ మా వలంటీర్ దగ్గర నుంచి దరఖాస్తుచేసి ఇంటి పట్టా తెచ్చి ఇచ్చారు. మాకు అమ్మఒడి పథకం రావడానికి అతనే కారణం.

– ముత్తింటి గనిరాజు, లబ్ధిదారు

ఎంతో కలుపుగోలుగా ఉంటారు

కొరిపల్లిలోని వలంటీర్ పులుగుల తాతారావు తన పరిధిలోని పులిదిండి పాపకు ఎంతో సహాయకరంగా ఉంటూ ప్రభుత్వ పథకాలను వివరించి వర్తింపచేశారు. భర్త లేని ఆమె కుటుంబానికి ఇంటిస్థలం రాయించి, పట్టా వచ్చేలా చేశారు. వైఎస్సార్ పింఛన్ కానుకలో పింఛన్ రాయించి, ప్రతినెల ఒకటో తేదీనే పొద్దుటే వెళ్లి, పింఛన్ ఇస్తున్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన వచ్చేలా చేశారు. తాతారావు చేస్తున్న సేవలకు ఆయా కుటుంబాలవారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పింఛన్ కోసం బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ తాతారావు

ఇంటి స్థలం వచ్చేలా చేశారు



చాలాకాలం నుంచి తాటాకింట్లోనే ఉంటున్నాం. గత ప్రభుత్వం హయాంలో ఇంటిస్థలం అడిగినా ఎవరూ పట్టించుకోలేదు. గ్రామ వలంటీర్లు వచ్చాక ఇంటికి వచ్చి ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి, ఇంటి నిర్మాణానికి రుణం ఇస్తోందని తెలిపి, సంతకాలు చేయించుకుని, దరఖాస్తు చేయించారు. తర్వాత ఇళ్లస్థలం వచ్చిందంటూ పట్టా చేతిలో పెట్టారు. మా లాంటి పేదోళ్లకు సేవలు చేసేందుకు జగనన్న నియమించిన వలంటీర్లను విమర్శించడం బాధనిపిస్తోంది. వలంటీర్ తాతారావు సేవలు జీవితాంతం గుర్తించుకుంటాం.

– ఇంటి పట్టా చూపిస్తున్న పులిదిండి పాప, కొరిపల్లి

అధిక మాస పూజలతో మరింత ఫలితం



అధికమాసం సందర్భంగా కాకినాడ మధ్వసభలో పూజలు చేస్తున్న పండితులు

బోట్‌క్లబ్: అధిక మాసం సందర్భంగా కాకినాడ మధ్వ సభ కమిటీ ఆధ్వర్యంలో సుధాపండితులు విశేష పూజలతో పాటు పవమాన హోమాన్ని గురువారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు రాచూరి రాఘవేంద్రస్వామి దంపతులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఉత్తరాది మఠ కేంద్ర కమిటీ ప్రతినిధి పండిత కానుగోవి వాసుదేవాచార్ పాల్గొని మాట్లాడుతూ అధికమాసం సందర్భంగా చేసే ప్రతీ కార్యక్రమం అత్యంత శుభ ప్రదమని భగవంతుని అనుగ్రహం పొందడానికి అవకాశం ఉందన్నారు. పవమాన హోమం నిర్వహించడం వల్ల శ్రీరామునితో పాటు, హనుమంతుని అనుగ్రహం పొందగలరని తెలిపారు. సుధా పండితులు రఘోత్తమాచార్, రఘుప్రేమాచార్, విజయసింహాచార్, సేతురామాచార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

నెల రోజులు ఇంటింటా సర్వే

- కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్



రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమైన డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల

కాకినాడ: సిటీ నియోజకవర్గ పరిధిలో ఆగస్టు 21వ తేదీ వరకు నెల రోజుల పాటు ఓటర్లకు సంబంధించి ఇంటింట సర్వే చేస్తున్నట్టు నగరపాలకసంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ చెప్పారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో ఏఈ ఆర్వోలు, సూపర్‌వైజర్లతో నెల రోజుల సర్వేపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఓటర్లను ఇంటింటా సర్వే చేసి నిర్ధారిస్తామన్నారు. బూత్ లెవెల్ అధికారులు చేపట్టే సర్వేలో ఆయా పార్టీల తరపున ఏజెంట్లను కూడా నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, వివిధ రాజకీయ నాయకుల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

సర్వేపై శిక్షణ

నెల రోజుల పాటు జరగనున్న సర్వేపై స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో శిక్షణ ఏర్పాటు చేశారు. కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ సర్వే ప్రక్రియపై బూత్ లెవెల్ అధికారులకు అవగాహన కల్పించారు.

సర్వేకు సహకరించండి

కాకినాడ సిటీ: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024 కార్యక్రమంలో భాగంగా అర్హత ఉన్న ఓటర్ల నమోదు చేయడం, ఓటర్ల శుద్ధీకరణకు ఈనెల 21వ తేదీ నుంచి ఆగస్టు 21 వరకు ఇంటింటి సర్వే చేస్తున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా గురువారం తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తారన్నారు. ప్రతి ఓటరు వారి వివరాలు స్వయంగా పరిశీలించుకుని అక్టోబర్ 1, 2023 నుంచి జనవరి 1, 2024వ తేదీ నాటికి 18 ఏళ్లునిండిన వారు ఓటరు గుర్తింపునకు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

ఆలయ అభివృద్ధే ధ్యేయం కావాలి



ప్రమాణ స్వీకారోత్సవ సభలో ప్రసంగిస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక తత్వం పెంచడంతో పాటు ఆలయ అభివృద్ధే ధ్యేయంగా పాలకవర్గాలు పని చేయాలని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలం శృంగార వల్లభ స్వామి దేవస్థాన నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం గురువారం జిల్లా దేవదాయ శాఖాధికారి పులి నారాయణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ చారిత్రక శృంగార వల్లభ స్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఇప్పటికే కోట్ల రూపాయలతో ఆలయ అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. తిరుమల తిరుపతి వేంకటేశుని ఆలయం తరువాత అంతటి మహిమ కలిగిన ఈ ఆలయ చరిత్ర ఎంతో ప్రశస్తమైనదని అన్నారు. వాడపల్లి వెంకన్న ఆలయం తరహాలో ఈ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని దొరబాబు అన్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్‌గా కర్రి వెంకట జగదీశ్వరరావు, పాలక మండలి సభ్యులుగా కుంచే వెంకటరమణ, రాకుర్తి కుమారి, అమలదాసు లక్ష్మి, అడబాల జగ్గారావు, అడపా శివ, పుల్లేటి కుమారి, ఎక్స్ అఫీషియో సభ్యులుగా పెద్దింటి నారాయణాచార్యులుతో ఈఓ నారాయణమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆలయ చైర్మన్, పాలక మండలి సభ్యులను దవులూరి దొరబాబు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పులిమేరు సొసైటీ అధ్యక్షులు గోపు నారాయణమూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, ఆవాల లక్ష్మీనారాయణల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. తొలుత దొరబాబుకు ఆలయ మర్యాదలతో పండితులు స్వాగతం పలికారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు హాజరయ్యారు.